# నమ్మకస్తుడు

మూర్తి కొంతకాలం రేషనింగ్ ఆఫీసులోనూ ఆ తర్వాత మరికొంతకాలం ఒక ప్రయివేటు కంపెనీలోనూ గుమాస్తాగా పనిచేసి ఆ ఉద్యోగాలు సంపాదించడానికి పట్టినంత కాలమైనా ఉండక అవి అతిసులభంగా పోయాక, ఆస్థానంలో అనుకూల వ్యక్తులను శాశ్వత వద్ధతిపై నియమించడం జరిగాక, ఇక వాటితో లాభంలేదని అనుకొని, పై చదువులకు వెళ్ళే అవకాశం లేక ఉవకారవేతనం సంపాదించి ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసి వృత్తిలో ప్రవేశించాడు.

గౌరవం, మర్యాద, న్యాయం, నిజాయితీ అన్నీ ఈ వృత్తిలో ఉన్నాయన్న గంపెడాశతో ఈ రంగంలోకి వచ్చాడు అతను.

ఆ పాఠశాలలో ఖాళీ ఉన్నదని తెలిసి మేనేజరుగారిని దర్శించి ఆ వని తనకు ఇప్పించమని అభ్యర్థించాడతను.

"ఏం ప్యాసయ్యారూ?"

"మీ పూర్తి పేరు సూర్యనారాయణ మూర్తి కదూ? ఇంటరు చదివినవారు బి. ఏ ఎందుకు చదివారుకాదు?"

"టీచర్ ట్రెయినింగ్ అయిందిగా?"

"పూర్వం ఎక్కడా పనిచెయ్యలేదా?"

"సర్టిఫికెట్లూ, టెస్టిమోనియల్సూ అన్నీ ఉన్నాయిగా?"

ఇంటర్వ్యూలో ఒక్కసారే గబగబా ప్రశ్నలు వేశారు హెడ్మాష్టరుగారు.

అతను అన్నింటికీ సమాధానాలు చెప్పగలడు ఆ క్రమంలోనే. కాని చెప్పలేదు. వినయం, భయం, ఆయన సమాధానాలు ఆశించడం లేదేమోనన్న అనుమానం అడ్డు రావడంవల్ల మాటలు పెకిలిరాలేదు. కొంతసేపు తర్వాత చెప్పబోయాడు. అతను భయపడుతున్నాడని గ్రహించి, కరుణించి, ఆ తర్వాత ప్రశ్నలు స్వరం తగ్గించి నెమ్మదిగా అడిగారు "కరస్పాండెంటు" గారు.

"మీ వయస్సెంత ?"

ఆయన వయస్సు నలభై అయిదుకు పై బడింది.

"ఇరవై రెండండీ"

మూర్తి పైకి పాతికేళ్లవాడులా కనిపిస్తాడు చక్కని మీసపుకట్టు కనుముక్కుతీరు అందమైంది. అతను ఎత్తరి. ఎత్తుకుతగ్గ వళ్లూ వచ్చింది.

"ఇంటరు ఎక్కడ చదివారూ?"

ఆయన విజయనగర పరిసర ప్రాంతాల్లోనూ భీమిలోనూ ప్రాథమిక పాఠశాలల పేరిట చిన్నతరహా వ్యాపారసంస్థలు నెలకొల్పి గతంలో ఆర్థికాభివృద్ధి సాధించి విద్యా వ్యాప్తికోసం 'స్వార్థరహితమైన కృషి కొనసాగించి, పాఠశాలలు నెలకొల్పుకుంటూ పోవడమే తమ ఆదర్శమని ప్రకటించి, విరాళాలు విరివిగా సేకరించి, నిధులు సమకూడిన తర్వాత దివాళాతీసినట్లు వెల్లడిచేయడం దగ్గరనుంచి రకరకాల వ్యవహారాలు వ్యాపారసరళిలో నిర్వహించారు ఆ రోజులలో కొంతమంది స్వార్థపరులు ఆయన ప్రయత్నాలకు ఏవో ఆటంకాలు కలిగించారట. అందువల్ల వారికి ఆ ప్రాంతపువాళ్లంటే బొత్తిగా గిట్టదు.

"రాజమండ్రిలోనండి"

మూర్తి కొంచెం గర్వంగా సమాధానం చెప్పాడు.

అతను రాజమహేంద్రవరం కళాశాల విద్యార్థి. అక్కడ చదువు కొనే రోజులలో కొంచెం దర్జాగా తిరిగినవాడే. తోటి విద్యార్థినులు ఏమనుకుంటారో అని చొక్కా లాగూ మాయనిచ్చేవాడుకాదు అప్పట్లో. ఇప్పుడా భయమేమీలేదు. అతనికి వివాహం అయింది.

"టీచర్ ట్రెయినింగ్ కూడా అక్కడేగా?" అతను "అవును" అన్నాడు.

'అమ్మయ్య' అన్నట్లు చూచారాయన.

ఆయన తృప్తిగా నెత్తి నిమురుకొన్నారు. వారిది బట్టతల. క్రాపు తాలూకు అవశేషాలు కొన్ని మిగిలాయి వెనుకభాగంలో. అవి కొన్ని నల్లనివి ఎక్కువభాగం తెల్లనివి. వారు వయసులో ఉండగా విజయనగరంలో "టెంపుల్ స్ట్రీట్" లో కొందరు నీలవేణులు ఆయన క్రాపునుచూచి మెచ్చుకున్నారట. ఆ విషయం వారు ఇప్పటికీ గర్వంగా చెప్పకొంటూఉంటారు.

నుదుటిపై పడుతున్న ఉంగరాలజుత్తు పైకి సర్దుకొని వినయంగా నెమ్మదిగా "సర్టిఫికెట్లూ అవీ దరఖాస్తుతో జతపరచానండీ" అన్నాడు.

"ఏమన్నారూ?"

బల్లమీద ఉన్న చిన్న విద్యుత్‌పంఖాను కొంచెం దగ్గరగా లాక్కొని కోటుజేబులో నుంచి తీసిన రంగు పెన్సిలుతో ఏదో వ్రాస్తున్నట్లు టిక్కులు పెడుతున్నట్లు నటిస్తూ అడిగారాయన.

పంచకొంగుతో ముఖం తడుచుకుంటూ ఆ విషయం మళ్లీ చెప్పాడతను. కుర్చీబల్లకు మరికొంచెందగ్గరగా జరుపుకొని, వెనక్కు వాలి కలం వెనుకభాగంతో పెదిమలను తాకుతూ ఆయన కొంచెం

పెద్దగా "అవన్నీ నాకనవసరం. మీఇంటర్వ్యూ అయిపోయింది.అర్థంలేని ప్రశ్నలన్నీ వేసి వచ్చిన అభ్యర్థిని చికాకువరచడం నాకు ఇష్టంలేదు. అదినరే మీరీ చిన్న ఉద్యోగంగురించి పాపం ఇంత దూరం వెళ్ళొచ్చారేమిటీ?" అన్నారు.

"మరేనండి..." అని ఆగాడు మూర్తి అప్పటికి అతనికి ఆశ కలిగింది. అతనిబావమరిదికూడ అ ఊళ్లోనే ఉన్నాడు. తనకూ అక్కడే ఈఉద్యోగం దొరికితే, చేరి స్థిరపడి బి.ఏ.కు ప్రయివేటుగా కడదామని... ఇంకా ఉన్నాయి ఆలోచనలు. మరే పాఠశాలలోను ఖాళీలులేవు.

ఆయన అతనివంక ఆదోరకంగా చూస్తూ "మా బళ్లో ఒకటీచరు వెళ్లిపోయారు. ఆయనస్థానంలో మిమ్మల్ని వెయ్యచ్చుకాని ఎవర్నీ వెయ్యకుండానే గడపేద్దామని చూస్తున్నా. ఇంతలో మీరు వెళ్ళొచ్చారు. వచ్చిన మనిషిని ఖాళీ ఉండెనుకదా-పంపించి వెయ్యడం న్యాయమా? ధర్మమా మీరు చెప్పండి" అన్నారు.

ఇంత దయగలవాడా ఈయన అనుకొన్నాడు మూర్తి. అతను నిజంగా ఎంతో సంతోషించాడు. అతను నెమ్మదిగా "దయఉంచి నన్ను ఆ ఖాళీలో వెయ్యండి" అన్నాడు.

ఆయన వెంటనే అందుకొని "ఆదేనండి నేను అదే ఆలోచిస్తున్నా. ఆ వెళ్లినవ్యక్తి ఎవరోకాదు. మాకు అయినవాడే. ఆయనమళ్లీ ఎప్పుడో ఒళ్ళొస్తారు. కాని..." అని ఆగాడు.

పోనీ అయన వచ్చేదాకా నన్ను ఆ ఖాళీలో తాత్కాలికంగానే వెయ్యండి. ఆయనవస్తే నేను మరెక్కడైనా చూచుకుంటాను." అన్నాడు మూర్తి. ఆయన సరిగ్గా ఆమాటకోనరమే అంతసేపూ కాచుకొని ఉన్నట్లు కన్పించారు అందుకే వారు ఉత్తరక్షణంలో "సర్లెండి మీరు రేపు ఒళ్ళొచ్చి చేరండి. తర్వాత సంగతి నేనుచూస్తాను. మీరుండగా మధ్యలో ఆయనెట్లా

వస్తాడు? వస్తే సమాధానం నేను చెబుతాను. అంతదూరంనుంచి వచ్చిన మిమ్మల్ని ఉట్టినేపంపడానికి నాకు మనస్కరించడంలేదు. ఆయన ఈ మధ్య బి ఏ. కూడా పూర్తిచేశారు, మళ్లీ ఇక్కడికే వస్తారనీ. నా సహాయమే అర్థిస్తారనీ అనుకోనక్కరలేదు. సరే ఆ గొడవలన్నీ మీకెందుకు మీరురేపు జాయిన్ అవండి. మిగతారూల్స్ అన్నీ మామూలే. గుమాస్తాగారు చెబుతారు. ఆయన్ను ఓసారి కలవండి. ఆయనతో సంప్రదించండి. కొసాకు ఒక్కమాట చెప్పాలి. మీరు ఉద్యోగంకోసం ఇతరత్రా ప్రయత్నాలు చెయ్యండి. ఎక్కడాదొరక్కపోతే ఇక్కడకు రండి. మరిమీరు వెళ్లి పనిచూచుకోండి" అన్నారు.

అతను లేచినిలబడి నమస్కారంచేసి బయటకు వెళుతుంటే ఆయన పెద్దగా "వస్తే పెందరాళే ఒళ్ళొచ్చేయండి. టైమ్‌టేబుల్ అదీ ఇచ్చేస్తాను" అన్నారు.

అయిదునిమిషాల తర్వాత బడిగేటుదాకా వెంటవచ్చిన గుమాస్తాను "మరి ఇతరరూల్సు ఏమిటండీ" అని అడిగాడు మూర్తి. ఆయన "పెద్దవిశేషమైనవి కాదు. ఒకటి వారి కమీషను. రెండోది లేటుగా రాక పోవడం మూడోది జీతం పుచ్చుకోవడంలో పేచీలు పెట్టకపోవడం" అన్నాడు.

"ఎంతండీ వారికమీషను?" ఎవరైనా వింటారేమోనని భయపడుతూ నెమ్మదిగా అడిగాడు మూర్తి. ఆయన అదేమీ రహస్యం కాదన్నట్లు పెద్దగా ఆ వీధిలో అవతలివైపున ఉన్నవాళ్ళకు కూడా విన్పించేలా "మొదట ముప్పై. ఆ తర్వాత నెలనెలా అయిదు" అన్నాడు.

మూర్తి "సరే సరే" అంటూ వెళ్ళిపోయాడు. అతను ఆరోజు రాత్రి తన యోగ్యతలకు, కార్యసాధనకు తన్ను తాను అభినందించు

కొన్నాడు. మునిముని నవ్వులు నవ్వుకొన్నాడు. బావమరిదిని సినిమాకు తీసికొనివెళ్ళి అక్కడ తను సాధించిన విజయంగురించి సగర్వంగా చెప్పుకొన్నాడు. ముందు జరగవలసిన ఏర్పాట్లనుగురించి అతనితో చర్చలు జరిపాడు.

మూర్తి ఆ మరునాడు ఆ బళ్ళోచేరాడు. అది పెద్దబస్తీలో బడే అయినా ఆ బడికి మాత్రం బస్తీపోకడలు లేవు. తరగతికీ తరగతికీమధ్య కొన్నిచోట్ల తడకలు అడ్డంపెట్టారు. కొన్నిచోట్ల అవీలేవు కొన్ని తరగతులలో మాత్రమే కుర్చీలు, బల్లలు, బెంచీలు ఉన్నాయి. నల్ల బల్లలసంఖ్య స్వల్పం. అవసరమైన తరగతులకు పిల్లలు వాటిని చేరవేస్తూ ఉంటారు. సీమ సున్నం ముక్కలు కంటికి కన్పించవు. అవసరాన్ని బట్టి మాష్టర్లో, పిల్లలో కొనుక్కొని వస్తూఉంటారు. పాఠం చెప్పదలచుకొన్న వాళ్ళకు గొంతుపెట్టుకొని పెద్దగా అరిస్తేనే కాని అక్కడ గంటగడవదు. ప్రక్కగానో ఎదురుగానో పాఠం చెబుతున్న మాస్టరుకంటె పెద్దగా అరిస్తేతప్ప తన తరగతి పిల్లలకు పాఠం విన్పించదు. అర్థం కావడం సంగతివేరు. ముందు పాఠం విన్పించాలి. అందుకు అందరూ తగు ప్రయత్నం చేస్తారు ఆబళ్ళో. ఇక పిల్లలు విన్నప్పుడు వింటారు. ఒక తరగతిలో కూర్చుని మరోతరగతిలో చెప్పే పాఠం వినడం వారికి అలవాటు.

ఉద్యోగంలో చేరిన నెలకే మూర్తికి ఆ బడితాలూకు భోగట్టా అంతా అందింది.

హెడ్మాష్టరుగారు చాలా తెలివైనవారనీ, మంచిసంపాదనపరులనీ తెలిసింది. క్రొత్తగా వచ్చేపిల్లలు సులభంగా ఒకటి రెండు మూడు ఫారాలలో చేరవచ్చును. అంతకు ముందు క్రిందితరగతులు మరో బళ్ళో చదివినట్లు సర్టిఫికెట్లు తీసుకొని రావలసిన అవసరంలేదు ఆపిల్లల తల్లిదండ్రులు వచ్చి వారిని దర్శించి వారు చెప్పిన లెక్కప్రకారం

వేటికివాటిని విడివిడిగా ముడుపు చెల్లిస్తే చాలు ఆ స్కూలులో పరీక్షలు ప్యాసుకావడానికి ఇదేపద్ధతి. బుద్ధిమంతులు, బీదపిల్లలు కష్టపడి చదివి ఉత్తీర్ణులు అయితే మిగతావాళ్ళు ముడుపులు చెల్లించి పైతరగతులకు వెళతారు. పాఠ్యగ్రంథాలన్నీ ఆయనే స్వయంగా పిల్లలకు అందజేస్తారు. పెన్సిళ్ళు, కలాలు, నోటుపుస్తకాలు, తెల్లకాగితాలు మొదలైన వాటికోసం పిల్లలు బయటకు పోనవసరంలేదు. "గుప్తా అండ్ కో ఎక్కడుంది? బడికిదూరంకదూ! పైగా పెద్ద బజారులో ఉన్నది. పిల్లలు రోడ్డు దాటి వెళ్ళడం కష్టం. కార్లూ బళ్లూ వస్తుంటాయి. పైగా సరుకు విషయం ఇంతగ్యారంటీ ఎవరిస్తారూ?" అంటూ ఉంటారాయన. అదేమిటండీ పిల్లలంతా బడికి రావడానికీ ఇంటికి వెళ్ళడానికీరోడ్డు దాటడంలేదా? ఇక్కడికంటే మంచివే వాళ్లు అమ్ముతున్నారు కదా!" అని ఎవరైనా అంటే ఆయనకు కోపం వస్తుంది. ఈ చిన్నతరహా వ్యాపారంలో ఆయనకు బాగా మిగులుతుందని గుమాస్తాగారి అభిప్రాయం. ఆయన ఆ స్కూలుకు హెడ్‌మాష్టరు. మేనేజరుకూడా ఆయనే. కరస్పాండెంటు పదవికూడా ఆయనదే. ఆ పాఠశాల సంస్థాపకులు ఆయనే. ఆయాపదవుల మూలంగా ఆయనకు అదనపు ఆదాయం వస్తుంది. విరాళాలు సేకరించే బాధ్యత కూడా ఆయనదే.

వీటి అన్నిటిమూలంగా ఆయన స్థిరాస్తి, చరాస్తి సంపాదించారు. స్థిరాస్తిగా ఉన్న ఇల్లు మారుతూ వచ్చింది. ఇల్లుకొనడం అది కదులుతున్నట్లు అనుమానంరాగానే కూలగొట్టి కట్టుదిట్టంగా మంచిఇల్లు కట్టడం దానికి ఇంక చలనంలేదని అందరూ అన్నాక అది అమ్మిమరోఇల్లు కొనడం.. ఇలా జరుగుతూ వచ్చింది అంతకు అయిదుసంవత్సరాలుగా చలనం లేకుండా పడిఉన్న కారు "స్థిరాస్తి" క్రింద ఉంటుందని కొన్నారు. ఇళ్ళవ్యవహారం స్థిరపడ్డాక ఆకారు బాగుచేయించి రోడ్డుమీద త్రిప్పడం మొదలు పెట్టారు. దానికి మంచిడ్రైవరు దొరకలేదు. ఎవరూ ఒక్కనెలకంటె ఎక్కువ ఉండలేదు. అమ్మేయమని అంతా సలహా

ఇచ్చారు. అంత ఓర్పుమాకు లేదన్నారు వారంతా. ఆయన ఒప్పుకోలేదు. ఫలితంగా కారుడ్రైవింగ్ ఆయనే నేర్చుకోవలసివచ్చింది.

ఆయనా కారు సొంతంగా నడుపగలరు. ఎవరినీ ప్రాధేయపడకుండా ముందుకుగాని వెనక్కుగాని త్రోసేయగలరు. మరమ్మతులు స్వయంగా చేయగలరు. ఆయన ఎక్కడికి వెళ్ళినా ఆ కారులోనే వెళతారు. తిరిగి రావడం వేరే విషయం. కారులో బయలుదేరి వెళితే శకునాలు చూడవలసిన అవసరం లేదని ఆయనవాదం. కొంతమంది వైద్యులు బాగా సంపాదన అందుకొన్నాక కారు కొంటారు. మరికొందరికి కారుకొన్నాక ప్రాక్టీసు ఎక్కువస్తుంది. ఆయనకు ఆ కారు కొన్నాక అదృష్టం కలిసివచ్చింది. "అదృష్టదేవత ఈ కారుఎక్కి నన్ను వరించ వచ్చింది.'' అంటారాయన. ఆ కారు వచ్చాక ఆయనకు మంచి పలుకుబడి వచ్చింది. కారులో వెళ్ళి బడినడపడానికి అయిదురూపాయలు విరాళం అడిగితే ఇవ్వనన్న వాడులేడు ఆ ప్రాంతాలలో ఒకే ఒకసారి తప్ప, అప్పుడాయన ఆకారు ఆసామి ఇంటిముందు ఆపారు.

"సరే బడినడపడానికీ ఇవ్వరా. సరే మంచిదే. ఈకారు మీరు నడుపుకోండి చూస్తాను. మరినాకు సెలవు" అని వెళ్ళిపోయారు. ఆ ఆసామి నలుగురు మనుషుల చేత ఆకారు తోయించుకొని వారిఇంటికి వచ్చి విరాళం ఇచ్చివెళ్ళారు.

వారికి ఆ కారంటే వల్లమాలిన అభిమానం. దానిని సతీసమానంగా పరిగణిస్తారాయన. ఒకసారి ఎవరో ఆయనతో "ఎందుకండీ ఈ పాతకారు? అమ్మేసి క్రొత్తది కొనుక్కోకూడదా" అని అంటే ఆయన వెంటనే ''మా ఆవిడకూడా ముసలిదైంది దాన్ని ఒగ్గేసి కొత్తగుంటను కట్టుకోమంటారా?'' అని ఎదురు ప్రశ్నవేశారట నవ్వుతూనే. ఆయన ఆవశంగా పోలికలూ, వ్యత్యాసాలూ చెప్పడం ప్రారంభించారు.

"దానికీ దీనికీ పోలికలున్నాయి. అదీ మొదట చాలకాలం చెల్లుబాటు కాలేదు. కొంచెం నలుపు, మెల్లకన్ను. వయసుకు మించిన ఒళ్ళు. మా మామ అయిదిస్తానన్నా, ఆరు యిస్తానన్నా వరుడు దొరకలా. దాని చెల్లెళ్ళు రెండు మూడు వేలకే ఇట్టే చెల్లుబాటయ్యారు. ఆయన స్వయంగా మా మేనమామ నేను చెప్పాను - ధర కొంచెం పెంచి మంచి సంబంధం చూడమన్నాను. అలా చేసినా రాలేదు. ధర తగ్గించి ఇమ్మనన్నాను. అదేమిటిరా అన్నాడు మా మామ. నాలుగు వేలు ఇస్తే నేను చేసుకొంటానన్నాను. నాలుగువేలు కంటె ఎక్కువ ఇవ్వతగిన సంబంధం కాదని చెప్పాను. ఆయన ఇచ్చాడు. నేను పుచ్చుకొని చేసుకొన్నాను. పిల్లచేదా డబ్బుచేదా? మా అమ్మ మొన్నటి దాకా అంటూ ఉండేది, ఒరేయి నష్టం ఒళ్ళొచ్చిందిరా అని. మా కుర్రాడికి పదివేలు కట్నం వచ్చింది. అప్పుడు నేను ఆరువేలు లాభం ఒళ్ళొచ్చిందే అమ్మా అన్నాను ఇంక నోరెత్తలేదు. ఇంకా ముగ్గురు మొగపిల్లలూ, ఒక ఆడపిల్లా ఉన్నారు.

అది అలా ఉంచండి. నిర్వహణ వ్యయం చూస్తే మా కారే నయమని అనిపిస్తుంది. దానికిప్పుడు రోజూ తలకు రంగు కావాలి. దీనికి పదేళ్ళకోసారి రంగుపూస్తే సరిపోతుంది. దానిలాగా ఇది ఎడ్డెం అంటే తెడ్డెం అనదు. కోపంవస్తే దానిలాగా ఇది చిందులు తొక్కదు ఊరికే నిలబడిపోతుంది. అందువల్లనే నా కారు ఎవరూ తోలుకుపోరు, నా భార్యను ఎవరూ ..."

వారి హాస్యసంభాషణ ఇలాగే ఉంటుంది. ఇవేకాక అక్కడి ఉపాధ్యాయులు ఆయనను గురించి ఇంకా చాలా విషయాలు చెప్పుకొంటారు. వారు అలా చెప్పుకోగా విని మూర్తి ఒక్కసారి "మిగతా సంగతులు ఎలా ఉన్నా పంతుళ్ల దగ్గరనుంచి ఇలా మామూళ్లు వసూలు చెయ్యడం ఎంత మాత్రం బాగాలేదు. పోనీ మనమంతా కలిసి

వెళ్ళిచెబితే..." అన్నాడు. ఆ మాట విన్న ఉపాధ్యాయుడు పెద్దగా నవ్వుతూ "ఎంత అమాయకులండీ మీరు! దానివల్ల ఏమీ లాభంలేదు. పైగా ఎవరూ కలిసిరారు. అయినా ఆయన ఇప్పుడు ఎంతో నయం- ఏ నెలజీతం ఆ నెల ఇచ్చేస్తున్నారు. పూర్వం అదీలేదు. ఈ నెల జీతం వచ్చేనెల ఒకటో తేదీన లేదా పదో తేదీ తర్వాత వస్తుండేది. ఎవరైనా మరీ వెంటపడి అడిగితే పదో పరకో చేతిలో పడేసి తప్పించుకొనే వారు" అన్నాడు.

మూర్తి చిరునవ్వు నవ్వి అనక్తి కనబరచేసరికి ఆయన ఇంకా ఇలా చెప్పారు.

"పూర్వం ఆయన్ను మాస్టరు ఎవరైనా డబ్బు అడిగితే ఇలా అనేవారు. చూడండి మాష్టారూ, ఇవ్వాళ సోమవారం కదూ, మంగళవారం బుధవారం వెళ్లనివ్వండి. గురువారం నాకు ఎలాగో వీలువడదు కదా, పోతే దేవుడు మేలుచేస్తే శుక్రవారం వచ్చి కనబడండి సర్దుతాను" అనేవారు.

ఆ రోజు వారింటికి వెళితే గుమ్మందగ్గిర చతికిలబడి కూర్చున్న ముసలమ్మ "ఇప్పుడే పైకి వెళ్లాడు" అంటుంది. పైకి అంటే బయటకు- ఊళ్ళోకి. మళ్ళీ ఎప్పుడు వస్తారో చెప్పి వెళ్లారేమో కాస్త కనుక్కోండి అంటే ఆవిడ కదలదు. కేకవేసి ఆవిడ ఎవరినీ పిలవదు. ఆ వచ్చిన మాస్టరు మళ్ళీ మళ్ళీ వారి గుమ్మం సందర్శించి వెనుతిరిగి పోవలసిందే. ఆ మాస్టరు అలా వచ్చి వెళుతుంటే ఒక్కొక్కసారి మేనేజరుగారు కారులో ఎక్కడికో మళ్లీ బయలుదేరబోతూ కన్పిస్తారు. ఆయన వెంటనే ఎంతో ఆప్యాయంగా పలకరించి "రండి రండి మాట్లాడుకొంటూ వెళదాం" అని ఆహ్వానించి కారులో ఎక్కించుకొని తీసుకొని వెళతారు. అలా బయలుదేరి ఆయన చాలా చోట్లకు వెళతారు. గుప్తా అండ్ కో

దగ్గర కారు ఆపినప్పుడు బడి జవాను ఎక్కడినుంచి వస్తాడో ఏమో హఠాత్తుగా అక్కడ ప్రత్యక్షమై నమస్కారాలు పెట్టి స్కూలు రికార్డు పుస్తకాలలో సంతకాలు చేయిస్తాడు. ఎప్పటిదో ఏమో టపా విప్పి చూపుతాడు. బళ్లో ఉన్నప్పుడు ఆయనకు ఇల్లాంటి పనులు చూచుకోడానికి తీరిక ఉండదు. అక్కడ ఉన్న కాసేపూ నాలుగు ప్రక్కలా తిరగడం అన్ని తరగతుల ముందుగా, ప్రక్కగా ఏదో పుస్తకం చూస్తూ పంతుళ్లను ఓ కంట కనిపెడుతూ నడవడం వంటి పనులు చేస్తూ ఉంటారు. సరే ఆ విషయాలు అలా ఉంచండి. డబ్బు అడుగవచ్చిన ఆ మాస్టర్ను కారులో అక్కడకూ ఇక్కడకూ తీసుకొని వెళ్ళి, ఎవరి ఇంటిముందో కారు ఆపి, లోపలకు వెళ్లి ఇహ ఈయనగారు ఈ జన్మకు రాడేమో అన్నంత ఆలస్యం చేస్తారు. ఒకసారి ఒక మాస్టరు ఆ కారులో అయిదు గంటలు అలా వేచి ఉండి విసిగిపోయి...

"ఈయన రాలేదు.

ఇక రారు కూడానూ.

బహుశా మా పంతుళ్ల జీతాలు ఇవ్వలేక ఇటునుంచి ఇటు ఎక్కడికో ఉడాయించి ఉంటారు. అయితే మరి ఇప్పుడేం చెయ్యాలి? పోనీ నేనే ఆయన తరఫున ఈ వ్యవహారం పైనలు చేస్తాను. అందుకు ఈ కారు అమ్మేస్తే... అబ్బే అమ్మనక్కర్లేదు- తాకట్టు పెడితే కనీసం రెండు వేలైనా వస్తాయి. పంతుళ్ళ జీతాలు బకాయిలతో సహా తీర్చేయవచ్చు. ఇంకా మిగిలితే బడికి వెల్ల వేయించవచ్చు. ఇంకా కొంచెం మిగిలితే గుమాస్తాగారికి ఇవ్వవచ్చు. వచ్చు వచ్చు అని ఇలా అనుకొంటూ ఉండగా ఆయన రానే వచ్చారు. వస్తూనే "అయ్యో పాపం మీరింకా ఇక్కడే ఉన్నారా- నేను మీ విషయమే మర్చిపోయాను. కారు మాట జ్ఞాపకం వచ్చి వచ్చాను ఇప్పుడైనా. మన బడి సంగతే ఆయనతో

ఇంతసేపూ మాట్లాడుతున్నాను. పెద్ద పోట్లాట అయిందనుకోండి. సరే మరి పోదాం రండి. మీకేం అర్జంటు పని లేదుగా. అలా వెళ్లి చల్లని పానీయాలు త్రాగి ఆ తర్వాత పని చూచుకొందాం" అన్నారు.

ఆ మాస్టరుగారికి చివరకు జ్ఞాపకం వచ్చింది డబ్బు విషయం. కాని అంతసేపు వారి కారులో - అదీ వారు స్వయంగా నడుపుతున్న కారులో కూర్చుని ఆయనతో సమానహోదాలో ఉన్నట్లు అవీ ఇవీ మాట్లాడి, వారితోపాటు చల్లని పానీయాలు త్రాగి పది రూపాయలు ఇమ్మని అడగటమా అని ఆలోచనలో పడ్డారు. ఆయన అడక్కముందే హెడ్‌మాస్టరుగారు పాఠశాలా నిర్వహణలో తాము ఎదుర్కోవలసి వస్తున్న వివిధానేక సమస్యలను గురించీ, ముఖ్యంగా డబ్బు ఇబ్బందులను గురించీ, పాఠశాల ఎత్తివేయడం వల్ల కలిగే లాభాలను గురించీ వివరించారు. అంత చెప్పినా మొండికేసి ఆ మాస్టరు "నాటుగా" డబ్బు అడిగారు. ఆయన ఎంతో నాజూగ్గా సమాధానం చెప్పారు. ఎంతో సానుభూతి కన్పరచి "అయ్యో పాపం మీరు నిజంగా ఇంత ఇబ్బందిలో ఉన్నారా. తెలియదు సుమండీ సరైతే రేపు ఉదయం పెందరాళే ఒక్కో రండి" అన్నారు. ఆ మాస్టరు అప్పుడే ఇమ్మని ప్రాధేయపడ్డాడు. అందుకు ఆయన "అబ్బే మీరు అలా అంటే ఎలా? శుక్రవారం. అందులో సంధ్యవేళ. అప్పు తెద్దామన్నా ఇవ్వడు ఎవరిస్తారూ" అన్నారు.

అంతే ఆ రోజుకు ఖాళీ.

ఆ మరునాడు శనివారం - ఆ పైన ఆదివారం. ఆ రెండు రోజులూ ఆయన కన్పించడు.

ఇక్కడ కొంతమంది మాస్టర్లు ఉన్నారు. వాళ్లకు వేరే ఆసరా లేదు. జీతంరాళ్ళపైనే ఆధారపడి ఉన్నారు. వారిలో ఎవరైనా ఆయన్ను

డబ్బుకోసం వేధిస్తూ రమ్మన్నప్పుడల్లా ఇంటికి వెళతారనుకోండి. అలా వెళ్ళినప్పుడు, ఎప్పుడైనా ఒకసారి ఆయన ఇంటిదగ్గర కన్పిస్తారు. అప్పుడాయన గబగబా బయటకు వచ్చి ఆ మాస్టరును గౌరవంగా పలకరించి లోపలకు తీసుకొని వెళ్ళి కాఫీ ఇచ్చి, ఆదరించి, మొదట ఆరోగ్యం విషయమై పరామర్శిస్తారు. పిల్లల క్షేమం గురించి అడిగి తెలుసుకొంటారు. దుబారా ఖర్చులు చెయ్యవద్దంటూ మొదలుపెట్టి క్లుప్తంగా, గుప్తంగా సంసారం గడుపుకోవడం గురించి వివరంగా, పెద్దగా మాటాడతారు. ఇటువంటి ప్రబోధాత్మక ప్రసంగాలలో మధ్యలో ఎక్కడో తప్పనిసరిగా కూరల ప్రస్తావన వస్తుంది. "మాస్టారూ, దొండకాయలు పాతిక రెండు అణాలు. కాని కొంచెం క్రొత్తవాళ్ళు కనపడ్డారా ఆ అమ్మి బేడా వరకూ లాగేస్తుంది. జాగ్రత్త. మోసపోకండి" అంటారు. ఇక అక్కడనుంచి ఆ ఊళ్ళో రిక్షావాళ్లూ, కూరలు అమ్మే ఆడవాళ్లూ చేసే మోసాలు ఎలా ఉంటాయో నిదానంగా, ఓపిగ్గా, సోదాహరణంగా చెప్పుకొని పోతారు. మధ్య మధ్య ఉపదేశం చేస్తూ ఉంటారు. ఇవన్నీ విని ఆ మాస్టరు ఆ పది రూపాయలూ ఇమ్మని అడగడం ఎలాగా అని మధనపడి చివరకు అభిమానం చంపుకొని నోరు తెరిచి అడిగితే ఆయన "ఆ ... ఆ ... అవునండీ నేనూ ఇద్దామనే అనుకొన్నాను. కాని రొఖ్ఖం లేదు. చెక్కు వ్రాసి ఇస్తాను-పట్టుకొని వెళ్ళండి" అని లోపలకు వెళతారు. అంతలో మళ్ళీ హాల్లోకి వస్తారు. ఇక అక్కడ ఉన్న బీరువాలన్నీ తెరుస్తారు. వాటినిండా పుస్తకాలు - బూజు పట్టినవి, దుమ్ము ధూళి పేరుకొన్నవి ఉంటాయి. అవన్నీ ఇటు వటూ, అటు విటూ సర్ది ఏమిటో వెతుకుతారు. ఆ తరువాత ఇల్లంతా వెతుకుతారు. భార్యనూ, పిల్లలనూ కేకలేస్తారు. నా ఆఫీసు గదిలోకి వెళ్ళి పోరావద్దని ఎన్నిసార్లు చెప్పానర్రా అని విసుక్కొంటారు.

చివరకు ఆయన సతీమణి వచ్చి "ఏందుగురించేమిటి వెతుకుతున్నారు?" అంటుంది.

"ఆ ఏముందీ చెక్కు పుస్తకం"

"అదా నిన్న బల్ల సొరుగులో పడేశారుగా"

ఇక అక్కడ నుంచి ఆయన తాళం చెవులకోసం వెతకడం ప్రారంభిస్తారు.

"తాళం చెవులు చిన్న సన్యాసి పట్టుకెళ్ళిపోయాడుగా" అని ఆయన సతీమణి వారికి జ్ఞాపకం చేసి లోపలకు వెళుతుంది.

ఇక ఆయన విసుక్కొంటూ "మీకు తెలుసుగా మన చిన్న సన్యాసికి అంటే మన బడి జవానుకు మతి మరుపని. స్కూల్లో నా బల్ల సొరుగుకూ, ఇక్కడ సొరుగుకూ ఒకే తాళం చెవి మళ్ళీ తెచ్చి ఇక్కడ పెట్టరా అని చెప్పాను. వాడు మరచిపోయాడు" అంటారు.

ఆ మాస్టరు చివరకు విసిగిపోయి తప్పంతా "చిన్న సన్యాసి"ది కనుక - అది అతని అసలు పేరు - ఇంకెవరూ చేయ గలిగిందేమీ లేదనుకొని వెళ్లిపోతాడు.

అలా జరిగేది పూర్వం. అందుకు కారణం ఉన్నదని విన్నాను. ఆయన వడ్డీ వ్యాపారం కూడా చేస్తూ ఉండేవారట, ఇప్పుడా ఇబ్బందేమీ లేదు. ఏ నెల జీతం ఆ నెల ఇచ్చేస్తున్నారుగా".

అంతా విని మూర్తి ఒక్కమాటైనా అనలేదు. గిట్టక కొంత, నవ్వులాటకు కొంతా ఇలా అంటున్నారని అనుకొన్నాడతను అతనికి ఆయనంటే గౌరవం, విశ్వాసం సడలలేదు. అందుకు కారణాలు లేక పోలేదు. అతని ఎదుటనే కొందరు మాస్టర్లకు ట్యూషన్లు చెప్పుకోమని గట్టిగా సలహా ఇచ్చారాయన. "ఇతర రంగాలలో కూడా పని చెయ్యండి.

పైన సంపాదించడానికి ప్రయత్నించండి. కొట్లల్లో లెక్కలు వ్రాయచ్చు. సినిమా హాల్సులో టిక్కెట్లు అమ్మవచ్చు. లాటరీ టికెట్లు అమ్ముకోవచ్చు. లేదా విశాఖ జిల్లా శాశ్వత కరువు నిధికి విరాళాలు వసూలు చెయ్యచ్చు. పార్ట్ టైమ్ జాబ్ సంపాదించడానికి నేను సహాయం చేస్తాను" అన్నా రాయన. కొందరికి భాగ్యవంతుల ఇండ్లలో ట్యూషన్లు, మరి కొందరికి ఇతర పనులు కుదిర్చిపెట్టిన మాట కూడా వాస్తవమే.

మూర్తి ఆ బడిలో చేరిన కొద్ది రోజుల తర్వాత ఆయన అతన్ని పనివేళా పిలిపించి "మూర్తిగారూ మీరు ట్యూషన్లు చెప్పుకోండి. కష్టపడి పని చెయ్యాలి. బస్తీలో జీతాలు చాలవు, పైన సంపాదించుకొని కడుపు నిండా తినాలి. అనవసరంగా మొహమాట పడకండి. అడిగితే కాని అమ్మయినా పెట్టదు. మీకీ వూరు క్రొత్త మీకు కిరాణా దుకాణంలో అక్కడా ఖాతా కావాలంటే చెప్పండి" అన్నారు.

మూర్తి కావాలన్నాడు. అనడమే తడవుగా కిరాణా కొట్టులో, బట్టల కొట్లో, ఆఖరికి కిల్లీ కొట్టులో కూడా ఖాతా ఇప్పించారు.

ఆ కొట్లన్నీ వారి బంధు మిత్రులవి.

మూర్తికి వారంటే గౌరవం; విశ్వాసం పెరిగాయే కాని తరగ లేదు. ఆలస్యంగా వచ్చినప్పుడు ఆయన చీవాట్లు పెట్టినప్పుడు కూడా అతను మరోలా అనుకోలేదు. పది నిముషాలు ముందుగా రావడం నేర్చుకొన్నాడతను. అలా వచ్చినందుకు శిక్ష క్రింద వారి రహస్యోప న్యాసాలు విన్నాడు. పై వాళ్ళ అదుపు, ఆజ్మాయిషీలతో నిమిత్తం లేకుండానే ఎవరికి వారు స్వీయ విధ్యుక్తధర్మ నిర్వహణతో నిజాయితీ చూపడం గురించీ, స్వయం శిక్షణను గురించీ, క్రమశిక్షణను గురించీ ఆయన ఉద్ఘాటించిన విషయాలన్నీ జాగ్రత్తగా, వినయంగా విన్నా డతను ఆయన ఎప్పుడైనా ఏదన్నా అన్నా వద్దాడు. తమాయించు

కొన్నాడు. విధులు చక్కగా నిర్వహించాడు పాఠశాల రాజకీయాలలో వేలుపెట్టక తన పనేదో తాను చూచుకొని పోయాడు అందరికంటె ఎక్కువగా ఆయనను గౌరవించాడు. అంతకంటె ఎక్కువగా ఆయనను నమ్మాడు.

కాని... కాని...

"ఉన్న ఉద్యోగం ఊడింది."

"ఉంటూవచ్చిన ఆ చిన్న ఉద్యోగం కాస్తా ఉట్టినే ఊడిపోయింది."

"పోకేం చేస్తుందీ?"

"అదేం ప్రశ్న? ఉండేదే. లక్షణంగా ఉండేది. కాని ఆయనగారు ఉండనిస్తేనా. పైగా ఆ పోవడం బడి మూసివేసే రోజున పోయింది తొమ్మిది నెలలుగా కష్టపడి పనిచేస్తూ, నేర్పుగా, ఓర్పుగా నిర్వహించు కొంటూ వచ్చిన ఉద్యోగం ఠపీమని అనుకోకుండా పోయింది వేసంగి సెలవులు రెండు నెలలూ నిరుద్యోగం అంటే చేతిలో రూపాయలు - రూపాయలు దాకానా - అణాలు - కనీసం పైసలు ఆడవు. వెధవ డబ్బు కాని ఆ డబ్బు లేకపోతే కాలం గడవనంటుంది. డబ్బు సంగతి జ్ఞాపకం చెయ్యకుండా ఒక్క నిముషం వెళ్ళదు"

"ప్రతి నిముషం వెక్కిరిస్తూనే వెళుతుంది."

"దీనికి అంతటికీ కారణం?"

"నిజమే ఏమిటి కారణం?"

"అసమర్థత. అంతే కాదు లౌకికజ్ఞానం సమంగా లేకపోవడం అంతే"

సూర్యనారాయణమూర్తి తనలో తాను తర్కించుకొంటూ, ఆలోచనలోపడి సతమతమవుతూ, అడుగులో అడుగు వేసుకొంటూ

శివాలయం సందుమలుపు తిరిగాడు. ఆ సందు చివరనే అతనుండే ఇల్లు. సముద్రం ఫర్లాంగు దూరంలో ఉన్నది కనుక, హోరుగాలి వసతి గృహంలో జొరబడి తక్కువ అద్దె ఇస్తూ గుట్టుగా కాలక్షేపం చేస్తున్న ఉద్యోగులకు నిద్రాభంగం కలిగిస్తుందేమోనని భయపడి ఆ యింటి యజమాని జాగ్రత్తపడ్డాడు. ఆ పెంకుటిల్లు ఎన్నిభాగాలు చేయవచ్చునా, అద్దెల క్రింద చిన్న మొత్తాలలో ఎంత పెద్ద మొత్తం రాబట్టవచ్చునా అని అంచనాలు వేశారే గాని అందులో ఉండేవాళ్లు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు గానీ, పురపాలక సంఘానికి గానీ, "పన్ను" రూపేణా సొమ్ము చెల్లించవలసిన అవసరం ఎంత మాత్రం లేని 'గాలి' కేవలం ఉచితంగా లభించే గాలి, ఎవరి ప్రమేయం లేకుండా సరఫరా అయ్యే గాలి ఇంట్లోకి వచ్చే ఏర్పాటు చెయ్యలేదు. వారి "ప్లాను"లో అందుకు ఎటువంటి అవకాశం కల్పించ లేదాయన. అయితే అంతమాత్రాన వారి ఔదార్యం తక్కువదని కాదు. "బస్తీ కనుక క్రొత్తవాళ్ళు వస్తారు. అందరికీ సొంత ఇళ్లు ఎట్లా ఉంటాయి! ఉండవు. వాళ్లలో అందరూ పెద్ద జీతగాళ్లు కాదు. అన్నీ పెద్ద భాగాలే అయితే స్వల్పాదాయవర్గం వారు ఏమవుతారు? ఇల్లంతా ఒక్కళ్లకే ఇచ్చేస్తే మరి వీళ్ల సంగ తేమిటి?" అంటూ ఉంటారాయన. వారికి తనయందూ, తనవంటివారి యందూ ఇంత సానుభూతి ఉండెను కదా అని మూర్తి సంతోషించాడు. అతను ఆయన్ను అభినందించాడు. అందువల్లనే అద్దె ఇవ్వడం ఎన్నడూ ఆలస్యం చెయ్యలేదు.

మూర్తి నెమ్మదిగా ఆ సందు మలుపు తిరిగాడే కాని అతని మనస్సు ఇంకా పాఠశాల ఆవరణలోనే ఉండిపోయింది. తొమ్మిది నెలలు- పూర్తిగా తొమ్మిది నెలలు వళ్లునంచి- కాదు- పెద్దగా అరిచి పనిచేశాడు. విధి నిర్వహణలో ఏ లోపమూ రానీయలేదు. అయితే

మొదటి రోజులలో అతను బడికి కొంచెం ఆలస్యంగా వచ్చినమాట నిజమే.

"ఒక్క నిముషం లేట్ అయినా లేట్ అనే అంటారండీ మూర్తిగారూ. రూపాయి అంటే పదహారు అణాలు. అందులో నుంచి ఒక్కటి అంటే ఒక్క అణా మినహాయించా మనుకోండి. అంతే అది ఇక రూపాయి కాదు అణా తక్కువ రూపాయి. అలాగే పదింటికీ అంటే పదింటికే మీరు ఒళ్ళొచ్చేయాలి. ప్రార్థనకు మీరూ హాజరు కావాలి" అన్న మేనేజరుగారి శాంతవచనాలు మొదట్లో మృదువుగానే విన్పించాయి. అప్పట్లో ఆయన "లేట్" "ఆనెస్టీ" అనే ఆంగ్లపదాలకు ఆలస్యం నిజాయితీ అనే మామూలు అర్థాలు కాక సరియైన పూర్తి అర్థాలు, నిర్వచనాలు చెప్పినప్పుడు ఆయా సందర్భాలలో పలురకాలుగా మార్పులు కూర్పులతో అన్వయం సాధించి వివరించినప్పుడు విని, అవగాహన చేసుకొని వారి విజ్ఞానం ఎంతటిదో తెలుసుకొని, చకితుడై వారికి అంజలి ఘటించాడు. కాని తర్వాత తర్వాత ఇతరులను చూచి తనూ అల్లాచేస్తే తప్పేమని అనుకొని కొన్నిసార్లు, సొంత ఇబ్బందులవల్ల కొన్నిసార్లు ఆలస్యంగా వచ్చినప్పుడు హెడ్‌మాష్టరుగారి "ఆ మాటలు" తరచుగా శ్రవణేంద్రియాలకు సోకి, కటువుగావిన్పించి గింగురుమనేసరికి వాటి అర్థమూ, వ్యంగ్యార్థమూ అతనికి బాగా అర్థం అయ్యాయి.

"మీరు మరలా లేట్ అయ్యారు."

"లేట్‌గా ఒళ్ళొ రావడం మానెయ్యాలి"

"లేటుమార్కు పెడుతున్నారా?"

"మీరు రూలు ప్రకారం ఎందుకు నడుచుకోరూ?" ఊళ్ళో ఉండి, వేరే పనిలేక బడికి వేళకు వచ్చినప్పుడల్లా హెడ్‌మాష్టర్‌గారు గుమ్మంలో నిలబడి పలికే స్వాగత వచనాలు అవి అలా అనడం ఆయనకు

మామూలయితే "అవునండీ క్షమించండీ" అనడం మూర్తికి అలవాటు అయింది. కాని ప్రతి నెలా మొదటి వారంరోజులూ చివర పదిరోజులూ అతనికి ఈ బాధ ఉండేది కాదు. ఆ పదిహేడు రోజులూ పది గంటలకు ఆయన ఆ ప్రాంతాలలో కన్పడరు.

ఆయన అలా అన్నప్పుడు 'ఎంత లేటండీ నిముషమే కదా!' అని అందామని అతనికి అనిపించింది. కొన్నిసార్లు "నన్ను ఒక్కర్నే అడుగుతారేమండీ? మాధవయ్యగారినీ, సీతారామయ్యగారినీ అడగనే అడగరేం? ఆ మాటకు వస్తే ఎంత మంది ఆలస్యంగా వస్తున్నారు వారికి ఎవరికైనా లేట్ మార్క్ పెడుతున్నారా?" అని గట్టిగా అడుగుదామని అనుకొన్నాడు మరికొన్ని సార్లు. "పిల్లల ప్రార్థనకు మేమంతా ఎందుకండీ?'' అని అందామని కూడా అనుకొన్నా డతను అనేకసార్లు "నాకు మీలాగా కారు లేదుగా'' అని అనాలని కోరిగ్గా కూడా ఉంటూ వచ్చింది.

కాని అత నెప్పుడూ అలా అనలేదు

అతనికి అంత సాహసం లేదు. అప్పుడే కాదు- చివరకు హఠాత్తుగా ఉద్యోగం నుంచి తీసివేసినప్పుడు కూడా అతను ఏమీ అనలేదు. అనడానికి సాహసం లేదతనికి. బడిలో చేరినప్పుడు నియామక పత్రం అంటూ ఏదీ ఇవ్వలేదు గాని, బడి మూనివేసే రోజున "రిలీవింగ్ ఆర్డర్" మాత్రం అతన్ని పిల్చి చేతికి ఇచ్చారు హెడ్ మాస్టరుగారు.

అటువంటిది జరుగుతుందని మూర్తి ఊహించలేదు. గుమాస్తాగారు బయటపెట్టిన రహస్యం అర్థం చేసుకొన్న తర్వాత వచ్చే సంవత్సరం కూడ ఎటువంటి ఆటంకం లేకుండా ఆ పాఠశాలలో ఉండవచ్చునని ఆశించాడతను. ఆ వెళ్ళిపోయాడన్న వ్యక్తి తిరిగివస్తే కదా భయం అనుకొన్నాడతను. నమ్మకస్తులైన హెడ్ మాస్టర్‌గారు తన్ను నమ్మిన

వ్యక్తికి అకారణంగా అన్యాయం చేస్తారని అతను కలలో కూడా అనుకోలేదు. బడి తెరచిన రోజునుంచి బడి మూసివేసే రోజువరకు పనిచేసిన తనకు న్యాయంగా "రూల్సు" ప్రకారం శెలవల జీతం అదే వస్తుందనీ, పైగా శెలవులలో దిద్దవలసిన పరీక్ష పేపర్లు - కట్టలు కట్టించి వారు స్వయంగా తనకు అందచేయడం వల్ల దురుద్దేశం అంటూ ఏదీ ఆయనకు లేదని కూడా అనుకొన్నాడతను.

అడగంగానే ఉద్యోగం ఇచ్చి ఆదరించారు. సర్వీసులో మొదటి సంవత్సరంలో శెలవులు పెట్టనే కూడదనీ, ఆ "రూలు" తెలియక శెలవుపెడితే జీతం "కట్" అయిపోతుందని చెప్పి ఆయన అతనిచేత ఎక్కువ పని చేయించారు. మిగతావారికంటె ఎక్కువ కష్టపడి పనిచేసి మంచిపేరు తెచ్చుకోవాలని సలహా చెప్పి రోజూ "ఎక్స్ట్రా వర్క్" వేసి అదనంగా పైసా ఇవ్వకుండా పనిచేయించుకొన్నా రాయన. అటువంటి వ్యక్తి తనకు చిన్నమెత్తు అన్యాయం తలపెడతారని అనుమానించలేదతను.

ఆ కాగితం అతని చేతికి ఇవ్వబోతున్నాడని తెలిసి ఆ బడిలో ఉపాధ్యాయులలో అందరికంటె పెద్దవారైన రామారావు పంతులుగారు అతని దగ్గరకు వెళ్ళి "అలా అని తెలిసింది. అది చాలా అన్యాయం. ఆ పత్రం తీసుకోకు. ముట్టినట్లు మాత్రం సంతకం చెయ్యకు. రూలు ప్రకారం న్యాయం చెయ్యమని గట్టిగా అడుగు" అంటూ చెవులో రహస్యంగా చెప్పి వెళ్ళినా అతను నమ్మలేదు. వారిమీద అతనికి అంత గౌరవం- విశ్వాసం.

తీరా ఆ పత్రం తీసుకొని నెమ్మదిగా చదువుకొని అతను ఆశ్చర్యపడిపోయి, కొయ్యలా నిలబడి పోయాదే కాని మారు మాటాడ లేదు అతను. అది కేవలం అన్యాయమని అతనికీ తోచకపోలేదు.

నియమ నిబంధనలకు విరుద్ధమని అతనికి తెలియకపోలేదు. ఆ విషయం అడుగుదామనే అనుకొన్నాడు. ఊరికే అడగడం కాదు- హక్కుల రక్షణకోసం ధైర్యంగా పోరాడుదామనే నిశ్చయించుకొన్నాడతను.

మూర్తికాక మరొకరైతే ప్రయోజనం లేకపోయినా ఆయనతో పోట్లాట పెట్టుకొనే వాడే.

మూర్తి మరోఅందుకు భయపడ్డాడు. తను ఎదిరించి ఏమైనా అంటే ఆయనకు కోపం వస్తుందేమోననీ, కోపంవచ్చి ఆయన తన్ను గురించి పై అధికారులకు చెడుగా వ్రాస్తారేమోననీ, వాస్తవం ఏమిటో వివరించడానికి అవకాశం ఉండదేమోననీ, తన మాటలు ఎవరూ వినరేమోననీ అతను భయపడ్డాడు. "అవును. ఎవ్వరూ వినరు. ఒక్కవంతులు మాట ఎవ్వరూ వినరు. విన్నా విశ్వసించరు. విశ్వసించినా సహాయం చెయ్యడానికి ముందుకు రారు. అసలు ఏ మాట అయినా పలుకుబడీ, పదవీ, ఐశ్వర్యం ఉంటేనే గాని వినరు. 'పోనీ తోటి ఉపాధ్యాయులలో ఎవరైనా వారితో ఈ విషయం గట్టిగా మాట్లాడకూడదూ ?' అనుకొన్నాడతను. కాని వారు తమకు రావలసిన- ఆయన ఇవ్వడానికి సిద్ధపడిన జీతంరాళ్ళు పుచ్చుకొని మారుమాటాడకుండా ఒకరి తర్వాత ఒకరు నిశ్శబ్దంగా పిల్లుల్లాగా బయటకు జారుకున్నారు- ఎక్కడ ఏమి శబ్దంచేస్తే ఆయనగారు కస్సుమంటారో అని భయపడుతూ భయంతో వణికిపోతూ తలవంచుకొని వెళ్ళిపోయారు.

మేనేజరుగారు మూర్తిని దగ్గరకు పిలిచి ఆ పత్రం, ఆ నెల జీతం, తరగతులలో పాఠాలు చెప్పడానికిగాను ఇచ్చిన పాఠ్యగ్రంథాలు నలిగిపోయి, చినిగిపోవడంచేత వాటి ఖరీదూ, అతని పేర తీసుకొన్నట్లున్న మరో పాత పుస్తకం ఖరీదూ మినహాయించుకొని మిగతా సొమ్ము లెక్కపెట్టి ఆయన గుమాస్తాకు ఇస్తే అతను హెడ్ మాస్టరుగారికి

నెలనెలా ఇవ్వవలసిన అయిదూ తీసుకొని మిగతా సొమ్ము పూర్తిగా ముట్టినట్లు సంతకం చేయించుకొని ఇచ్చేశాడు.

ఆయన అతనివంక చూచారు.

అతను కృతజ్ఞతాపూర్వక అభినందనలు తెలియచేస్తాడని ఆశిస్తున్నట్లు కన్పించా రాయన.

మూర్తి నెమ్మదిగా తేరుకొని, మారుమాటాడకుండా, ఆలోచనలో పడి అడుగులో అడుగు వేసుకొంటూ బయటకు నడిచాడు. ఆయనకు నమస్కారం చేసి మరీ వెళ్ళాడు. అతను ఆ గదిగుమ్మం దాటాక ఆయన వెనక్కు పిలిచారు. అతను తిరిగి వెళ్ళి ముందు నిలబడినప్పుడు ఆయన "మీ మంచికే ఇలా చేశాను. గడచిన నెల అంతా మీకు పెద్ద పనిలేదు. అందుకే పేపర్లు మీకు ఇచ్చాను. వారం రోజులలో దిద్ది ఇచ్చేయండి. ఈ నెల జీతం మీకు ముట్టింది. ఈ శెలవులలో మీరు మంచి ఉద్యోగం సంపాదించండి. ఇది వృత్తిగా స్వీకరించవద్దు. మీవంటివాళ్ళకు ఇది ఉత్తమమైనది కాదు. ఇతర ఉద్యోగాల కోసం ప్రయత్నించండి. అవి ఏవీ దొరక్కపోతే ఏదైనా సరే చిన్నవ్యాపారం చెయ్యండి. ఆఖరుకు చిన్న కిళ్లీకొట్టు పెట్టుకొన్నా బాగుపడతారు. తప్పులేదు. స్వతంత్రంగా ఏ చిన్న వ్యాపారం చేసినా చెయ్యవచ్చు. ఇట్టే పైకి వస్తారు. మీరు ఆ ప్రయత్నాలు చెయ్యండి. అవేవీ కుదరక పోతే మళ్ళీ ఒళ్ళోరండి. మీ దరఖాస్తు శ్రద్ధగా, సానుభూతితో పరిశీలిస్తాను. మీరు యువకులు. తెలివైనవారు. కష్టపడి పనిచేసేవాళ్ళు. ఇతరత్రా బ్రతకలేకపోరు. ఏ ప్రయత్నమూ కలిసిరాకపోతే మళ్ళీ వెళ్ళొచ్చేయండి. ఈ పనే ఇస్తాను..." అన్నారు.

మూర్తి నెమ్మదిగా వెనుతిరిగాడు.

బడిగేటు బయట నిలబడి ఉన్న ఉపాధ్యాయులలో ఒకరు

అతనితో రహస్యంగా "మళ్ళీ వెళ్ళి గట్టిగా అడగండి ... ఆఫీసుకు వెళ్లి పై అధికారులకి ఫిర్యాదు చేస్తానని భయపెట్టండి. అది లాభం లేకపోతే ఏదో విధంగా ప్రాథేయపడండి అంతేకాని శెలవల జీతం అంతా ఆయనకు ఉట్టినే ధారపోయకండి" అన్నారు. ఆయన ప్రక్కనున్న మరో ఉపాధ్యాయుడు "మీరు అనుకొంటున్న మాటలు నాకూ విన్పించాయి. కాని నా అభిప్రాయం చెబుతున్నాను. ఏమీ లాభం లేదు. అటువంటి ప్రయత్నాలేవీ చెయ్యకండి. మీరు పై అధికారులకు ఫిర్యాదు చేసినా వాళ్ళు వినరు. ఒకవేళ విని ఆయనతో చెప్పినా ఆయన చెప్పుడు మాటలు వినే మనిషి కాదు. మనం అంతా కలిసి అర్జీ పెట్టుకొనే అవకాశం లేదు. నాతోసహా ఎవరూ కూడిరారు. తగాదాదాకా వస్తే సాక్ష్యాలు కావలసి వస్తాయి. ఆయనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి ఎవ్వరూ ముందుకు రారు మాలో ఎవ్వరూ రారు. మీరు మరేమీ అనుకోకండి. రారంతే" అన్నారు.

ఆయన ప్రక్కనే ఉన్న మరో మాస్టరు "మూర్తిగారూ, మీరు ఈ మాత్రానికే గాభరా పడకండి. ఈ రకం అన్యాయాలు ఇక్కడ ఒక్కచోటే కాదు- చాలా స్కూళ్లలో జరుగుతున్నాయి. పై వాళ్ళకూ తెలుసు. తెలిసీ ఊరుకొంటున్నారంటే అర్థం ఏమిటి? సరే. ఆవిషయం వదిలేద్దాం. మీరు ఇవ్వాళనుంచే మరో మంచి స్కూల్లో ప్రయత్నించండి. ఇక్కడ ఏ మాస్టరూ కొద్దికాలమే తప్ప శాశ్వతంగా ఉండలేదు. ఇదీ ఒక అనుభవమే. నవ్వేసి వెళ్ళిపోండి" అని ఒక్క క్షణం ఆగి చెవులో నెమ్మదిగా "సాయంకాలం మా యింటికి రండి. డాబా తోటలో పార్కుకు ఎదురుగా ఉన్న ఇల్లు. అక్కడకు వచ్చి ఎవర్ని అడిగినా చెబుతారు. ఈ చుట్టుపట్ల ఏ స్కూళ్ళకు ఎలా దరఖాస్తు పెట్టాలో, ఎవరి ద్వారా పనులు సాధించాలో చెబుతాను. శెలవలలో జీతంలేదే అని దిగులు పడకండి. బోలెడు ట్యూషన్లున్నాయి. ఇప్పిస్తాను రండి" అన్నారు.

మూర్తి "సరే" అంటూ ముందుకు నడిచాడు. అతను అక్కడ నుంచి ఏమో ఆలోచిస్తూ నెమ్మదిగా ఇంటి దారి పట్టాడు. అతను శివాలయం సందు మలుపు తిరిగాడు. ఆ మలుపులో ఉండగా అతనికో క్రొత్త ఆలోచన వచ్చింది. ఊళ్ళో ఉన్న బాకీలు బేరీజు వేశాడతను. జేబులో ఉన్న డబ్బువంక చూచుకొన్నాడతను.

"పోనీ బాకీలు ఎగేస్తే?"

"ఎంత సాహసం! ఎంత అధర్మం!"

"నన్ను నమ్మి వాళ్ళు ఖాతాపెడితే నేను ఎగేసిపోవడమా?!"

"ఏం తప్పా? అంత సంపాదించిన మేనేజరుగారు - నేను నమ్మిన హెడ్‌మాస్టరుగారు- లోకాన్ని నమ్మించిన కరస్పాండెంటుగారు- విరాళాలు కాజేస్తున్న పాఠశాల సంస్థాపకులు నాకు శెలవల జీతం అంతా గుట్టుచప్పుడు కాకుండా ఎగేయలా? వీళ్లంతా ఆయన బంధు మిత్రులేగా. పైగా ఆయన హామీ ఉన్నాడుగా?" అనుకొన్నాడతను.

అంతలో అతను పెద్దగా "ఛ... నేనలా చెయ్యను. అబ్బే నేను ఎప్పటికీ అలా చెయ్యను. చేతనైతే ఆయన్ను సాధించాలి కాని, మధ్య వీళ్ళనెందుకు బాధించాలి" అన్నాడు. లోపల అనుకొన్న మాటే పైకి అన్నాడతను. అలా అంటూ గబగబా కిరాణాకొట్టుకు వెళ్లాడు. అలా వెళుతూ బాకీలన్నీ తీర్చేస్తే ఎంత మిగులుతుందా అని లెక్కలుకట్టాడు. తనకూ, భార్యకూ రైలు ఛార్జీలకు డబ్బు చాలకపోతే బావమరిదిని అప్పు అడగాలని కూడా అనుకొన్నాడతను.

కిరాణాకొట్టు ముందు నిల్చొని అతను ఒక్క నిముషం మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

"పోనీ - ఇటువంటి విషయాలు - రాజకీయాలూ, పెద్దఎత్తు వ్యవహారాలూ, ధర్మాధర్మాలూ తెలిసిన పెద్దలకు - శాసన సభ్యులకూ-

మంత్రులకూ - అల్లాంటివాళ్లకు తెలియచేస్తే - తనకాదు - జరిగిన అన్యాయం స్వయంగా చూచినవాళ్లు ఎవరైనా ఆ పని చేస్తే... చేస్తే బాగానే ఉంటుంది..." అనుకొన్నాడు మూర్తి.

"క్రాంపతీని ఎవరుగాని అల్లా చెయ్యడానికి ప్రయత్నించేరు సమండీ! ఎవరూ సాక్ష్యం చెప్పరు.

అందుకు ఎవరూ ముందుకు రారు. అంత ధైర్యం ఇక్కడ ఎవరికీ లేదు. బలమైన సాక్ష్యం దానికి మద్దతుగా ధనం, పలుకుబడీ ఉంటేనే గాని న్యాయానికి న్యాయస్థానంలోనే స్థానం ఉండదు. ఎవరి మాట ఎలా ఉన్నా మాస్టర్లు మాత్రం సాక్ష్యం చెప్పడానికి ముందుకు రారు. ఏదో చాటుగా, తలవంచుకొని పనిచేసుకొంటూ బ్రతుకుబరువులు వెళ్ళదీసే పాఠశాలల ఉపాధ్యాయులు - మేనేజర్లకు కోపంవచ్చి ఉన్న ఉద్యోగాలు ఊడగొడితే వేరే ఉపాధి కల్పించుకోలేనివాళ్ళు- ఆ వృత్తికీ- తద్వారా అబ్బుతున్న దారిద్ర్యానికీ క్రమంగా అలవాటుపడిన వాళ్ళు- నూటికి తొంభై మందికి పైగా ఆస్తిపాస్తులు లేనివాళ్లు - అందాకా ఎందుకండీ మంచివిలేక చినుగు లాల్చీలు వేసుకొని మాసిన ఉత్తరీయాలు కప్పుకొని వీధిలోకి వచ్చేవాళ్ళు - బీదపంతుళ్లు - వాళ్ళకు ఏ విధమైన ఇబ్బందీ రానీయకండి.

బాబ్బాబు మీకూ, మీ పెద్దలకూ నమస్కారం. ఆయన జోలికి పోకండి.

పలుకుబడి కలవాడు, బాగా సంపాదించినవాడు, అంత సులభంగానూ ఖర్చుపెట్టగలవాడు, ఆయన జోలికి పోకండి. ఆయనకు ఆగ్రహం తెప్పించకండి. మీకు నిజంగా రాజకీయవేత్తలతో, శాసన సభ్యులతో - మంత్రులతో పరిచయాలు ఉంటే - ఇటువంటి స్వల్ప విషయాలు విడిచిపెట్టి ... వంటి అంతర్జాతీయ ప్రాముఖ్యం కల

తీర్మానాలు అసెంబ్లీలో ప్రవేశ పెట్టించడానికి ప్రయత్నించండి. రాష్ట్ర విధాన సభలలో ప్రవేశ పెట్టి, రోజుల తరబడి చర్చించి, రకరకాల సవరణలు ప్రతిపాదించి, కొనకు ఆమోదించవలసిన తీర్మానాలు అవే. అవి ఉదాత్తమైన అంశాలు, ఆయా తీర్మానాలు రూపొందించడానికి మీరు సలహాలు ఇవ్వండి. ముసాయిదా తీర్మానాలు వ్రాసి ఇవ్వండి. అటువంటి మీ సలహాలకూ, రచనా వ్యాసంగానికీ, కృషికీ గౌరవం ఉంటుంది. అదీకాక అలాంటి తీర్మానాలు చెయ్యడం పై వారికి సుళువు కూడానూ..."

మూర్తి వెనుతిరిగి చూచాడు.

ఎవరో ఏదో వెనుక నిల్చుని చెబుతున్నట్లే ఉన్నది. సీతారామయ్య మాస్టారు జ్ఞాపకం వచ్చి మూర్తి నవ్వుకొన్నాడు.